సాక్షి
విజయనగరం
మంగళవారం । 6 । మే । 2025



ఆస్తమా..అలక్ష్యం..అంతే..!

ఆస్తమా (ఉబ్బసం) వ్యాధి పిల్లలతో పాటు పెద్దలకు వ్యాప్తి చెందుతుంది. వ్యాధి పట్ల అలసత్వం వహిస్తే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. - 8లో



23.400 కేజీల గంజాయి పట్టివేత

ఒడిశా రాష్ట్రం నుంచి అరకు, విశాఖపట్నం మీదుగా హైదరాబాద్‌కు కారులో 23 కేజీల400 గ్రాముల గంజాయి తరలిస్తుండగా కొత్తవలస పోలీసులు పట్టుకున్నారు. - 8లో



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం - 8లో

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారమే ధ్యేయంగా జిల్లా అధికారులు పనిచేయాలని డీఆర్వో కె.హేమలత సూచించారు.

న్యూస్‌రీల్

అవి దేవస్థానం భూములే..

- స్పందించిన జాయింట్ కలెక్టర్
- రెవెన్యూ అధికారుల పరిశీలన
- నీలకంఠేశ్వస్వామి దేవస్థానం భూములేనని నిర్ధారణ



చీపురుపల్లిలోని ఆంజనేయపురంలో సర్వే నంబర్ 135లో నీలకంఠేశ్వరదేవస్థానం భూములు పరిశీలిస్తున్న రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

చీపురుపల్లి: నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం భూముల్లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. 'దేవుడి భూముల్లో అక్రమ కట్టడాలు' అనే శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనంపై జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ స్పందించారు. తక్షణమే విచారణ జరిపి సమగ్ర నివేదిక అందజేయాలని ఆర్డీఓ సత్యవాణిను ఆదేశించారు. ఆర్డీఓ సూచనల మేరకు చీపురుపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ కె.సూర్యకాంతం, మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వో భవానీ, చీపురుపల్లి పట్టణ సర్వేయర్ కాళీ, దేవదాయశాఖ సిబ్బంది మణికంఠ తదితరులు చీపురుపల్లి పట్టణంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి దేవస్థానం భూములను సోమవారం పరిశీలించారు. ఆ భూముల్లో అక్రమ నిర్మాణాలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 135లో 18.86 ఎకరాల భూమి ఉమానీలకంఠేశ్వరస్వామి దేవస్థానానికి చెందినవేనని నిర్ధారించామని చెప్పారు. ఇదే విషయాన్ని నివేదిక సిద్ధంచేసి ఆర్డీఓకు అందజేస్తామని స్పష్టంచేశారు. అదే సర్వే నంబర్‌లో చాలా ఇళ్ల నిర్మాణాలు జరిగినట్లు గుర్తించామన్నారు. రాజాం రోడ్డులోని బంగారమ్మకాలనీలో సర్వేనంబర్ 209-6లో శ్రీ ఉమారామలింగేశ్వర దేవస్థానానికి చెందిన భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆ భూములను కూడా పరిశీలించినట్లు చెప్పారు. రికార్డుల పరంగా ఆ భూములు కూడా దేవస్థానానికి చెందినవేనని, అక్కడ ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరపరాదని నివేదిక అందజేస్తామని తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, నిర్ధీత కాలవ్యవధిలో అనుమతులు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతుమాధవన్ మాట్లాడుతూ.. సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేసి, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. గత మూడు నెలల్లో పరిశ్రమల స్థాపనకు 149 దరఖాస్తులు రాగా.. వీటిలో ఇప్పటివరకు 138 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. చేతి వృత్తిదారులకు చేయూత నిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేస్తోందని.. ఈక్రమంలో వీలైనంత వేగంగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. విశ్వకర్మ యోజన పథకానికి 86,386 దరఖాస్తులు రాగా.. మూడు దశల్లో వాటిని పరిశీలిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వీరిలో ఇప్పటివరకు కేవలం 1,080 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేయడం పట్ల ఇన్‌చార్జ్ కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జీఎం శ్రీధర్, సహాయ సంచాలకుడు బి.రామకృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

12 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ తెలిపారు. ఈ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సోమవారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. పరీక్షల కన్వీనర్, రీజనల్ ఇన్‌స్పెక్షన్ అధికారి ఎస్.తవిటినాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షలకు సుమారు 15,000 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 6,000 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు పాల్గొన్నారు.

సర్కారు నిర్లక్ష్యం.. రైతన్నకు నష్టం



- ధాన్యం దళారుల పాలు
- మద్దతు ధర లభించడం లేదంటూ ఆవేదన
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- రబీలో 2,314 ఎకరాల్లో వరి సాగు
- క్వింటాకు రూ.500 నుంచి రూ.600 వరకు నష్టపోతున్న రైతులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళా రైతు పేరు సూరెడ్డి హైమావతి. ఈమెది మెంటాడ మండలం లోతు గెడ్డ గ్రామం. రబీలో 1121 రకం నాలుగు ఎకరాల్లో సాగు చేశారు. 100 బస్తాలు (బస్తా 80కిలోలు) దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో స్థానిక వ్యాపారికి క్వింటా ధాన్యం ధర రూ.2,340 కాగా రూ.1710 చొప్పున విక్రయించారు. క్వింటాకు రూ.640 నష్టపోయారు. ప్రభుత్వం కొనుగోలు చేసి ఉంటే మద్దతు ధర లభించేదని, కష్టమంతా దళారులపాలైందని, దీనికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడమే కారణమన్నది ఆమె ఆవేదన.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు సూరెడ్డి సత్యనారాయణ. ఇతనది మెంటాడ మండలం లోతు గెడ్డ గ్రామం.ఇతనికి మూడు ఎకరాల పొలం ఉంది. అందులో 1121 వరి రకం సాగు చేశారు. 75 బస్తాల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడం వల్ల ఇతను కూడా స్థానిక వ్యాపారికే క్వింటా రూ.1710 చొప్పున విక్రయించారు.



మెంటాడ మండలంలో విక్రయించడానికి సిద్ధం చేసిన ధాన్యం



రైతులు నుంచి దళారులు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు

విజయనగరం ఫోర్ట్:

అందరికీ అన్నంపెట్టే రైతన్నకు కష్టకాలం వచ్చింది. పంటను కొనుగోలు చేయాలంటూ ప్రాధేయపడే గడ్డు పరిస్థితి ఎదురవుతోంది. ధాన్యం, కూరగాయలు, అపరాలు.. ఇలా.. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన ఏ పంటకూ మార్కెట్‌లో మద్దతు ధర లేదు. కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందడం లేదు. ధాన్యం, అపరాలు కొనుగోలు చేయండి మహాప్రభో అంటూ అర్థిస్తున్నా పట్టించుకునేవారే లేకపోవడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. అన్నివిధాలా ఆదుకుంటామని గొప్పలు చెప్పిన కూటమి సర్కారు.. మద్దతు ధర కల్పించడంలో విఫలమైందని, పంటను కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని రైతులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ తీరును దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రబీ ధాన్యం దళారులు చెప్పిన ధరకే అమ్మాల్సి వస్తోందని వాపోతున్నారు.

● కొనుగోలు కేంద్రాలు ఏవీ?

రబీ సీజన్ ముగుస్తున్నా కూటమి ప్రభుత్వం ఇంత వరకు జిల్లాలో ఒక్కచోట కూడా ధాన్యం కొనుగోలు కేంద్రంఏర్పాటు చేయలేదు. కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. ఓ వైపు వాతావరణంలో మార్పులు రైతన్నలో గుబులు పుట్టిస్తున్నాయి. వర్షాలకు చేతికొచ్చిన పంట తడిసిపోతుందన్న బెంగ వెంటాడుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్న నమ్మకాన్ని విడిచిపెట్టి తక్కువ ధరకే దళారులకు పంటను విక్రయిస్తున్నారు.

● 2,314 ఎకరాల్లో రబీ వరి సాగు

జిల్లాలో రబీ సీజన్‌లో వరి పంట 2314.55 ఎకరాల్లో సాగైంది. 3,300 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనావేశారు. 2206.43 ఎకరాల్లో ఈ-క్రాప్, ఈకేవైసీ కూడా పూర్తి అయింది. 1611 మంది రైతులకు 1528 మంది రైతులు ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకున్నారు. ఇన్నిచేసినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో పంట విక్రయానికి రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. గత్యంతరం లేక క్వింటా ధాన్యం మద్దతు ధర రూ.2,340కాగా, వ్యాపారులు నిర్ణయించిన రూ.1700 నుంచి రూ.1800 మధ్య ధరకు విక్రయిస్తున్నారు.

కలెక్టరేట్ వద్ద అపరాల రైతు ఆందోళన

జిల్లాలో ఐదు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా ఒక్క గింజకూడా కొనుగోలు చేయకపోవడంపై అపరాల రైతులు విజయనగరం కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ ముందు మినుములను రాశిగా పోసి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. రైతు కష్టాలు కూటమి నేతలకు వినిపిస్తున్నాయా అంటూ నినదించారు. రైతన్నకు ఇబ్బంది పెట్టే ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని హెచ్చరించారు.



కలెక్టరేట్ వద్ద మినుమురైతుల ఆందోళన

అనుమతి రాలేదు

"రబీలో పండించిన ధాన్యం కొనుగోలుకు అవసరమైన కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎటువంటి అనుమతులు రాలేదు.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్షణాల్లో చుట్టుముట్టిన అగ్నికీలలు... ఇద్దరిని సజీవదహనం చేశాయి. కాపాడాలన్న వారి ఆర్తనాదాలు విన్నవారిని దగ్గరకు వెళ్లనీయకుండా భయపెట్టాయి. కళ్లముందరే బూడిదగా మార్చాయి. లారీలో ఇరుక్కుపోయి ఒకరు.. పూరి గుడిసెలో మరొకరు ప్రాణాలు విడిచారు. జిల్లాలో వేర్వేరు చోట్ల సోమవారం జరిగిన ఈ ప్రమాదాలు చూసిన వారి హృదయాలు ద్రవించాయి. కుటుంబ సభ్యులకు శోకాన్ని మిగిల్చాయి.



నాతవలస టోల్ గేట్ వద్ద అగ్ని మంటల్లో కాలిపోతున్న లారీ



ప్రమాదంలో సజీవదహనమైన డ్రైవర్ బసుదేబ్ సికిధర్ (ఫైల్)

కళ్లముందే ఘోరం

- అగ్నిమంటల్లో ఇద్దరు సజీవదహనం
- అగ్నిని ఆర్పేలోపే గాలిలో కలిసిన ప్రాణాలు
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

● పశ్చిమబెంగాల్ నుంచి విశాఖపట్నం వెళ్తూ...

డెంకాడ: వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించాడు. మరో గంట ప్రయాణిస్తే చాలు ఆ లారీ డ్రైవర్ విశాఖపట్నంలోని గమ్యస్థానానికి చేరుకుంటాడు. ఇంతలో మృత్యువు వెంటాడింది. డెంకాడ మండలం నాతవలస టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ దగ్ధంకాగా, అందులో ఉన్న డ్రైవర్ సజీవదహనమయ్యాడు. ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నా సమయంలో జ్యూట్ గోనెల లోడ్‌తో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి విశాఖపట్నానికి లారీ వెళ్తోంది. నాతవలస టోల్‌గేట్ వద్ద టైరు పంక్చరై రోడ్డు పక్కన ఆగి ఉన్న నూకల లోడ్ లారీని బలంగా ఢీకొట్టింది. జ్యూట్ గోనెలు లారీ క్యాబిన్ దగ్గరగా నొక్కుకుపోయింది. డ్రైవర్ బసుదేబ్ సికిధర్(44) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఇంతలో ఇంజిన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. జ్యూట్ గోనెల లోడ్ కావడంతో క్షణాల్లో మంటలు వ్యాపించాయి. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ బసుదేబ్ సికిధర్ కాపాడాలంటూ కేకలు వేసినా ఎవరూ దగ్గరకు వెళ్లలేకపోయారు. ఆయనను మంటలు చుట్టుముట్టడంతో ప్రాణాలు విడిచాడు. అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. గోనెలతో పాటు లారీ పూర్తిగా కాలిబూడిదైంది. మృతుడిది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని నియామపూర్ ప్రీతినగర్‌గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదుచేశారు.

● మంచంపైనుంచే మృత్యు ఒడికి..



చీపురుపల్లిరూరల్ (గరివిడి): అప్పుడే తెల్లారుతోంది. గ్రామస్తులు ఒక్కొక్కరుగా వీధుల్లోకి వస్తున్నారు. ఇంతలో ఓ పూరిగుడిసె నుంచి మంటలు వ్యాప్తిచెందాయి. ఆర్పేలోపే గుడిసెను చుట్టుముట్టాయి. అంతే... అందులో నివసిస్తున్న 70 సంవత్సరాల వయస్సు ఉన్న యడ్ల అసిరితల్లి మంచంపైనే సజీవదహనమైంది. ఈ విషాదకర ఘటన గరివిడి మండలం కోనూరు గ్రామంలో సోమవారం ఉదయం 5 గంటల సమయంలో జరిగింది. వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. భార్యా పిల్లలతో గ్రామంలోనే ఉంటున్నారు. వృద్ధురాలు గ్రామంలోని పూరింటిలో నివసిస్తూ ప్రమాదానికి గురైంది. ఘటనా స్థలాన్ని గరివిడి తహసీల్దార్ సీహెచ్ బంగారాజు పరిశీలించారు. ఇంటిలో గ్యాస్ లీకైక కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్టు నిర్ధారించారు.



అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న పూరిల్లు (ఇన్‌సెట్లో) అగ్ని ప్రమాదంలో సజీవదహనమైన అసిరితల్లి (ఫైల్)

దాడితల్లి సిరిమానోత్సవానికి సర్వం సిద్ధం

- 300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- 90 సీసీ కెమెరాలతో నిఘా
- ఏంఎసీ కూడలి నుంచి కృష్ణాపురం మీదుగా వాహనాల మళ్లింపు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందల్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

బొబ్బిలి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు దాడితల్లి సిరిమానోత్సవానికి సర్వంసిద్ధమైంది. తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సిరిమానోత్సవాన్ని పక్కా ఏర్పాట్లు చేశారు. గొల్లపల్లిలోని పైల వీధిలో గద్దె ఉన్న ప్రాంతంలో అంగడి కట్టిన ఇంటి వద్ద పూజారి బత్తిన కృష్ణ సిరిమానును మంగళవారం సాయంత్రం 5 గంటలకు అధిరోహిస్తారు. గత 30 ఏళ్లగా బత్తిన కుటుంబ సభ్యులే సిరిమాను పూజారిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

సిరిమానోత్సవానికి పటిష్ట బందోబస్తు

దాడితల్లి సిరిమానోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సిరిమాను తిరిగే ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ సతీష్‌కుమార్‌లతో బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. రోడ్ మ్యాప్‌ను పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలను తెలుసుకున్నారు. ఏంఎసీ కూడలి నుంచి కృష్ణాపురం మీదుగా వాహనాల మళ్లింపు ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతరం భక్తుల దర్శనాలు, ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణారావుతో పాటు కమిటీ సభ్యులు మండల జనార్దన రావు, వజ్జి రవి, ఎస్.ఎస్.హేమంత్ స్థానిక పెద్దలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిరిమానోత్సవానికి 300 మంది పోలీసులను బందోబస్తు విధులకు నియమించామన్నారు. 90 సీసీ కెమెరాలతో నిఘా వేశామన్నారు. సోమవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు సిబ్బంది డ్యూటీలో ఉంటారన్నారు. ప్రశాంత వాతావరణంలో భక్తులు సిరిమానోత్సవాన్ని వీక్షించవచ్చన్నారు. ప్రజలంతా పోలీసులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలకు సహకరిస్తూ అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని సూచించారు.

గిరిజన విద్యార్థులకే అధిక సీట్లు

- కోర్సులపై అవగాహన సదస్సులు నిర్వహించాలి
- ఎస్టీ కమిషనర్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావును సత్కరిస్తున్న గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సుల్లో గిరిజన విద్యార్థులకు అధిక సీట్లు కేటాయించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సంబంధిత చట్టంలో మార్పులు తీసుకురావాల్సి ఉందన్నారు. ఈ విషయమై ఎస్టీ కమిషన్ తరపున కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని చెప్పారు. అలాగే యూనివర్సిటీలో అందిస్తున్న కోర్సులపై గిరిజన యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. విజయనగరంలోని గాజులరేగ ప్రాంతంలో ఉన్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ టీవీ కట్టిమణి, ఇతర అధికారులు, అధ్యాపకులతో సమావేశమై గిరిజనుల అభివృద్ధిలో యూనివర్సిటీ నిర్వహిస్తున్న పాత్ర, అందిస్తున్న కోర్సులపై సమీక్షించారు. యూనివర్సిటీ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. అంతకుముందు వీసీ, తదితరులు శంకరరావును సత్కరించారు.

పనుల పురోగతిపై ఆరా..

దత్తిరాజేరు/విజయనగరం అర్బన్: మెంటాడ మండలం కుంటినవలస వద్ద చేపడుతున్న గిరిజన విశ్వవిద్యాలయం శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులను ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ.. పనుల పురోగతిపై ఆరా తీశారు. 561 ఎకరాలలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని.. భూములు ఇచ్చిన రైతులకు రూ. 61.06 కోట్లు, అప్రోచ్ రోడ్డుకు రూ. 16 కోట్లు.. సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ. 48.61 కోట్లు కేటాయించినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. జాతీయ రహదారి నుంచి విశ్వవిద్యాలయ క్యాంపస్‌కు చేరుకునేందుకు అనుసంధాన రోడ్డు పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసి వీలైనంత త్వరగా శాశ్వత భవనాలను అందుబాటులోకి తీసుకువస్తామని చైర్మన్‌కు వివరించారు. పరిశీలనలో బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహనరావు, యూనివర్సిటీ ఏఓ సూర్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జెడ్పీ అతిథి గృహంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, విజయనగరం ఆర్డీఓ కీర్తి, తదితరులు ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలసి గిరిజన విశ్వవిద్యాలయంలో వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న చర్యలను వివరించారు.



కుంటినవలసలో యూనివర్సిటీ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు, తదితరులు



అలంకరణలో పైడితల్లి అమ్మవారు

యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...

- మే 12న పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం
- చాటింపు చేసిన ఆలయ తలయారీలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి చదురుగుడికి తీసుకువచ్చే దేవర మహోత్సవానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 12న నిర్వహించనున్న దేవర మహోత్సవ ఘట్టాన్ని ప్రజలందరికీ తెలియజేసేలా పైడితల్లి అమ్మవారి ఆలయ తలయారీ రామవరపు చినపైడిరాజు బృందం సోమవారం సాయంత్రం ఆలయ ఆవరణలో చాటింపు వేసింది. అమ్మవారికి భాజాభజంత్రీలు, డప్పు వాయిద్యాల నడుమ సాంబ్రాణి ధూపంతో ప్రత్యేక పూజలు నిర్వహించి మనవి చెప్పారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్, సిబ్బంది, అధికారులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ చాటింపు వేశారు. భక్తులందరూ ఆ రోజు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకోవాలని కోరారు.

ఏర్పాట్లు చేస్తున్నాం

ఆలయ ఇన్‌చార్జి ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ మాట్లాడుతూ దేవర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మే 12వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గాడీఖానా, ఎన్‌సీఎస్ రోడ్డు, గంటస్తంభం మీదుగా హుకుంపేటలో ఉన్న అమ్మవారి చదురువద్దకు తీసుకువెళ్లి పూజలు చేస్తామన్నారు. రాత్రి 10 గంటలకు హుకుంపేట నుంచి ఊరేగింపుగా మంగళవారం వేకువజామున మూడులాంతర్లు వద్ద నున్న చదురుగుడి వద్దకు తరలించి ఆశీనులు చేస్తారని తెలిపారు. అప్పటి నుంచి అమ్మవారు ఉయ్యాల కంబాల మహోత్సవం వరకూ చదురుగుడిలోనే కొలువై భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులందరూ దేవర మహోత్సవంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ సూపర్ వైజర్ ఏడుకొండలు, రమేష్ పట్నాయక్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంతంలో దేవర ఉత్సవ చాటింపు వేస్తున్న ఆలయ తలయారీ బృందం

క్లుప్తంగా

నేడు ఈసెట్, ఐసెట్ రేపు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఏపీ ఈసెట్ -2025 ప్రవేశ పరీక్ష మంగళవారం జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 2,184 మంది అభ్యర్థుల కోసం ఐదు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రాజాం జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, సీతం ఇంజినీరింగ్ కళాశాల, లెండి ఇంజినీరింగ్ కళాశాల, అంతి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. అలాగే ఈ నెల 7వ తేదీన ఏపీ ఐసెట్ -2025 ప్రవేశ పరీక్షను నిర్వహించడానికి జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఈ పరీక్ష రాస్తున్న 1,548 మంది అభ్యర్థుల కోసం రాజాం జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల, గాజులరేగ ఐయాన్ డిజిటల్ జోన్, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులుగా ఈ పరీక్ష జరుగుతుంది.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత


ఉదయ్ కిరణ్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న ప్రత్యేక ఉప కలెక్టర్ డా. పి.ధర్మారెడ్డి

పార్వతీపురంటౌన్: సాలూరు మండలం, శివరాంపురం గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు అల్లు.ఉదయ్ కిరణ్‌కు వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా సుమారు రూ: 33 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను ప్రత్యేక ఉప కలెక్టర్ డా.పి.ధర్మారెడ్డి సోమవారం పీజీఆర్ఎస్. సమావేశ మందిరంలో అందజేశారు. కడప జిల్లా డా.వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో మూడవ సంవత్సరం పెయింటింగ్‌లో డిగ్రీ చదువుతున్న ఉదయ్‌కిరణ్ మూగ, చెవుడుతో బాధపడుతూ విద్యనభ్యసిస్తున్నాడు. తన చదువుకు, ఉపాధికి ల్యాప్‌టాప్ మంజూరు చేయాలని కోరగా, ఆ విద్యార్థికి సోమవారం ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీరామమూర్తి, వికలాంగుల సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని సోమవారం ఉదయం ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భోగాపురం గ్రామానికి చెందిన దుబ్బక సంతోష్ (37) వ్యవసాయ పనులు చేసుకుంటు కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వేకువజామున జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలానికి వెళ్లాడు. బహిర్భూమికని చెప్పి పొలంలో నుంచి జాతీయ రహదారికి అవతలి వైపు వెళ్లెందుకు రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో డివైడర్‌పై ఉన్న మొక్కల పొదల్లో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తండ్రి అప్పన్న, తల్లి ఈశ్వరమ్మ ఉన్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

రెండు పూరిళ్లు దగ్ధం


నష్టాన్ని పరిశీలిస్తున్న వీఆర్ఓ శ్రీనివాసరావు

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్రలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన జక్కువ కంచమ్మ, ముడుదాపు నాగభూషణకు చెందిన పూరిళ్లు కాలిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైంది. కట్టుబట్టలతో బాధితులు అగ్నిప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న వీఆర్‌ఓ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని నివేదికను తహసీల్దార్‌కు సమర్పించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹152	₹274	₹284

ఆస్తమా..అలక్ష్యం..అంతే..!

- జిల్లాలో నెలకు 800 నుంచి 1000 వరకు కేసుల నమోదు
- సకాలంలో చికిత్స చేసుకోకపోతే మృత్యువాత పడే ప్రమాదం
- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం


సర్వజన ఆస్పత్రిలో ఆస్తమా లక్షణాలు ఉన్న రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: ఆస్తమా (ఉబ్బసం) వ్యాధి పిల్లలతో పాటు పెద్దలకు వ్యాప్తి చెందుతుంది. వ్యాధి పట్ల అలసత్వం వహిస్తే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. జన్యుపరంగా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అయితే పొగతాగేవారికి ఆస్తమా ఉంటే వ్యాధి మరింత తీవ్రమవుతుంది. మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. ఆస్తమా బాల్యదశలో కూడా చిన్నారులకు వ్యాప్తి చెందుతుంది. దీన్ని వాడుక భాషలో పాల ఉబ్బస అంటారు. ఈ వ్యాధి సోకితే మనిషిని కుదురుగా ఉండనీయదు. ముఖ్యంగా చలికాలంలో ఈవ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వేసవిలో కాస్త ప్రశాంతంగా ఉంటారు. వేసవిలో కూడా ఆస్తమా ఉన్నవారు చల్లటి నీరు తాగితే వ్యాధి తీవ్రం అవుతుంది.

సైనసైటిస్, ఇస్నోఫిలియో ఆస్తమాగా మార్పు

సైనసైటిస్, ఇస్నోఫిలియో, ఫుడ్‌ఎలర్జీ, డస్ట్‌ఎలర్జీ క్రమేణా ఆస్తమాగా మారుతాయి. ఈ సమస్యలు ఉన్నవారు జాగ్రత్తలు పాటిస్తే ఆస్తమా బారిన పడకుండా ఉంటారు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి బారిన పడతారు. చలికాలంలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి చలికాలంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి.

సొంతంగా మందులు వాడకూడదు



ఆస్తమా లక్షణాలు ఉన్నవారు మెడికల్ షాపుల్లోను, ఆర్‌ఎంపీల వద్ద మందులు కొనుగోలు చేసి వేసుకుంటారు. ఇలా చేయడం వల్ల తాత్కాలికంగా తగ్గినప్పటికీ వ్యాధి తీవ్రమవుతుంది. ఆస్తమా లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న పలమనాలజిస్టును సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. ఇన్‌హేలర్స్ వాడడం ద్వారా వ్యాధి అదుపులోకి వస్తుంది. – డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, పలమనాలజిస్ట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

జిల్లాలో 800 నుంచి 1000 కేసుల నమోదు

జిల్లా వ్యాప్తంగా నెలలో 800 నుంచి 1000 వరకు కేసులు నమోదవుతున్నాయి. సర్వజన ఆస్పత్రిలో నెలకు 200 నుంచి 300 మంది ఆస్తమా రోగులు చికిత్స కోసం వస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

- ఆయాసంగా ఉండడం
- పిల్లికూతలు రావడం
- ఛాతీ భారంగా ఉండడం
- కఫం ఎక్కువగా ఊరుతుండడం
- ఊబకాయం వల్ల కూడా అస్తమా వస్తుంది
- గర్భిణుల్లోనూ ఆస్తమా వచ్చే అవకాశం
- వ్యాధి తీవ్రమైతే మృత్యువాతపడే ఆస్కారం
- వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పలమనాలజిస్టును కలిసి చికిత్స చేయించుకోవాలి. వ్యాధి తీవ్రమైతే శ్వాసవ్యవస్థ ఆగిపోయి చనిపోయే ప్రమాదం ఉంది. ప్రపంచ ఆరోగ్య వ్యవస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాల ప్రకారం రోజుకు 100మంది ఆస్తమాతో ప్రాణాలు వదులుతున్నారు.

కొరియా సమస్యపై ముఖ్యమంత్రి,గవర్నర్లతో మాట్లాడాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం


రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకర్రావుకు వినతిపత్రం అందజేసిన పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు గ్రామాలైన వివాదాస్పద కొఠియా గిరిజనులను ఒడిశా అధికారులు, పోలీసులు ఇబ్బందులు పెడుతున్న తీరుపై ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల గవర్నర్లతోను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మాట్లాడి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్రావును విజయనగరం జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా పరిషత్ అతిథిగృహంలో ఛైర్మన్‌తో సమావేశమై కొఠియా వివాదాస్పద గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. గడిచిన 55 సంవత్సరాలుగా రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో 21గ్రామాల్లో 6 పంచాయతీల్లో వివాదం ఉందని వివరించారు. కార్యక్రమంలో పౌరవేదిక ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, తాడేపల్లి నాగేశ్వరరావు, తుమ్మగంటి రామ్మోహన్ రావు, ధాత్రాజు రాజారావు, తిరుపతిరావు, గోపాలరావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇప్పించండి సారూ..!


కలెక్టరేట్ వద్ద సమస్యను తెలుపుతున్న గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: గడిచిన 60ఏళ్లుగా చేస్తున్న వ్యవసాయ భూములకు సంబంధించి పట్టాలు ఇప్పించాలని వీరఘట్టం మండలం శాంతిగూడ, గదబవలస, జడగూడ, సింధునగరం, పెద్దూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేసి డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ పూర్వీకులనుంచి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, ఫారెస్టు అధికారులు తమ భూములు ఖాళీ చేయాలని చెబుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తమపై దయఉంచి ఈ భూములకు సంబంధించి పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సంతృప్తి చెందేలా వినతుల పరిష్కారం

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్
- పీజీఆర్ఎస్‌కు 177 వినతులు


వినతులను స్వీకరిస్తున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. ప్రధానంగా ఆడిట్ టీమ్ రిమార్కుల్లో సంతృప్తి చెందినట్లు రాయాలన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ పెండింగ్ వినతులు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 177 వినతులు అందాయి. ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో కీర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

వర్షాల పట్ల అప్రమత్తం

రెండు రోజుల పాటు జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మున్సిపల్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశించారు. తగు జాగ్రత్తలు తీసుకుంటూ నష్టాలు సంభవిస్తే వెంటనే తెలియజేయాలని సూచించారు.


ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ, ఏఎస్పీలు

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 32 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: స్థానిక డీపీఓలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 32 ఫిర్యాదులను ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత స్వీకరించారు. ఫిర్యాదుల్లో భూ తగాదాలు 15,, కుటుంబ కలహాలు3, మోసాలు3 ఇతర సమస్యలకు సంబంధించి 11 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులపై ఫిర్యాదు దారుల ముందే సంబంధిత స్టేషన్ హౌస్‌ఆఫీసర్లతో ఎస్పీ చర్చించారు. ఫిర్యాదుల పట్ల సానుకూలంగా సిబ్బంది స్పందించాలని సూచించారు. ఫిర్యాదులోని అంశాలను నిశితంగా పరిశీలించి అందులో వాస్తవాలను అవసరమైతే క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు లీలారావు, చౌదరి, డీసీఆర్బీ సీఐ సుధాకర్, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- డీఆర్ఓ హేమలత
- పీజీఆర్ఎస్‌కు 98 వినతులు


పార్వతీపురం టౌన్: ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి


పార్వతీపురం రూరల్: వినతులు స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత

పార్వతీపురంటౌన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారమే ధ్యేయంగా జిల్లా అధికారులు పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, పరిష్కారంలో అర్జీలు రీ ఓపెన్ కారాదని అధికారులను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ డా.పి.ధర్మచంద్రారెడ్డి భాగస్వామ్యమై 98 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని, నాణ్యత గల ఎండార్స్ మెంట్ అందజేయాలని అధికారులకు సూచించారు.

చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలి

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులపై చట్టపరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఫిర్యాదులకు సంబంధించి పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ శాఖ కార్యాలయానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి స్వయంగా స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఫిర్యాదులు వాస్తవాలైతే చట్టపరమైన చర్యలతో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ సిబ్బందికి ఎస్పీ ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులలో ప్రధానంగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల వసూలు, ప్రేమ పేరుతో మోసాలపై పలు ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 14 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్సైలు ఫకృద్దీన్, జగదీష్‌నాయుడు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 26 వినతులు


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 26 వినతులు వచ్చాయి. దబర పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ప్రసాదరావు తదితరులు కోరారు. మేడఒబ్బంగి, కొండాడ గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని అక్కడి గిరిజనులు అర్జీ ఇచ్చారు. సెల్‌టవర్ నిర్మించాలని లాడ గ్రామస్తులు కోరారు. ఆర్ఓఎఫ్ఆర్ భూములు సర్వే చేసి పట్టాలు ఇప్పించాలని పొగడవెల్లి గ్రామస్తులు విన్నవించారు. అంబలిగండి నుంచి కుంబి గ్రామానికి రహదారి నిర్మించాలని ఆయా ప్రాంతాల గిరిజనులు కోరారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో జిల్లా స్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు


విజేతలతో నిర్వాహకులు, పీడీలు

బొబ్బిలి: పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాల ఏవీ హాలులో సోమవారం జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో బి.హర్షిత్, బి.అభినయ కార్తీక్‌లు విన్నర్, రన్నర్‌లుగా, సీనియర్ విభాగంలో బి.ధనుంజయ్, టి.సత్యనారాయణలు విన్నర్, రన్నర్‌లుగా నిలిచారని పీడీ వెంకటనాయుడు తెలిపారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్, బాల్‌బ్యాడ్మింటన్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏబీసీ నాయుడు, రాజీవ్, అరుణ్‌కుమార్, జలగం శ్రీనివాస్ ప్రభాకర్, హెచ్ఎం సునీత తదితరులు పాల్గొని విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లుండాలి

- ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్


మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడే విధంగా ఉపాధ్యాయ పోస్టులను క్రమబద్ధీకరించాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల కేంద్రాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయనగరం మండల కేంద్రం ఎదుట సంఘం కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు రెండు టీచర్ పోస్టులకు తప్పనిసరి చేయాలని కోరారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, పీడీ పోస్టులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండవ సెక్షన్ ఇవ్వాలని కోరారు. 12వ పీఆర్‌సీ వేసి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు తక్షణమే విడుదల చేయాలని పేర్కొన్నారు. అనంతరం వినతిపత్రాన్ని మండల అధికారికి అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, రాష్ట్ర కౌన్సిల్ కర్రి రవి, పీవీప్రసాద్, మజ్జి రమేష్, గురుమూర్తి, మర్రాపు శ్రీనివాసరావు, తిరుమలరెడ్డి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, సంపూర్ణలత, పి.లత, కె.శ్రీనివాసన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

23.400 కేజీల గంజాయి పట్టివేత


కొత్తవలస: పట్టుబడిన గంజాయి, నిందితులను చూపిస్తున్న సీఐ షణ్ముఖరావు, ఎస్సై మన్మథరావు


పాచిపెంట: స్వాధీనం చేసుకున్న గంజాయితో సీఐ రామకృష్ణ, ఎస్సై వెంకట సురేష్

కొత్తవలస: ఒడిశా రాష్ట్రం నుంచి అరకు, విశాఖపట్నం మీదుగా హైదరాబాద్‌కు కారులో 23 కేజీల, 400 గ్రాముల గంజాయి తరలిస్తుండగా కొత్తవలస పోలీసులు మండలంలోని మంగళపాలెం జంక్షన్ సమీపంలో సోమవారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంజాయి కారులో తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై మన్మథరావు తన సిబ్బందితో మంగళపాలెం జంక్షన్ వద్ద మాటు వేశారు. దీంతో ముందుగా పల్సర్ బండిపై ఒక వ్యక్తి వెళ్తుండగా పోలీసులు అనుమానం వచ్చి ఆపగా బైక్ అక్కడే వదిలేసి తప్పించుకుని పారిపోయాడు. ఈ దృశ్యాన్ని వెనుక షిఫ్ట్ డిజైర్ కారులో వస్తున్న వారు గమనించి కారు ఆపి పారిపోయేందుకు ప్రయత్నించగా అనుమానం వచ్చిన పోలీసులు కారులో గల ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేసి గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కారు నాలుగు డోర్ల పై కవర్లు విప్పి అందులో 23 కేజీల,4వందల గ్రాముల గంజాయిని 48 ప్యాకెట్లుగా విభజించి దాచి యథావిధిగా డోర్స్ కవర్లు వేసి ఉండడం గమనించారు. దీంతో నిందితులను, కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి తహసీల్దార్ బి.నీలకంఠరావు సమక్షంలో కారు డోర్లు తెరిచి అందులో గల గంజాయిని వెలుపలకు తీశారు. శ్రీకాకుళం జిల్లా రేగిడి ఆముదాలవలస మండలం పెద్దచెర్ల గ్రామానికి చెందిన పాలవలస జనార్దన్, పాలవలస రాంబాబులుగా నిందితులను గుర్తించారు. వారిని విచారణ చేయగా ఒడిశా రాష్ట్రంలో కొనుగోలు చేసి హైద్రాబాద్‌కు కారులో తరలిస్తున్నట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

పాచిపెంటలో 127 కేజీలు..

పాచిపెంట: కారులో అక్రమంగా తరలిస్తున్న 127 కేజీల గంజాయిని పాచిపెంట పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సాలూరు రూరల్ సీఐ రామ కృష్ణ సోమవారం పాచిపెంట పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. మండలంలోని పద్మాపురం జంక్షన్‌లో సోమవారం మధ్యాహ్నం అనుమానస్పదంగా ఓ కారు ఆగి ఉండడాన్ని గమనించిన స్థానిక వీఆర్వో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై వెంకట సురేష్ సిబ్బందితో వెళ్లి కారును పరిశీలించి, అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించి స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో తూనిక వేసి స్వాధీనం చేసుకుని కేసు నమోదు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

మూగజీవాల సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలి

- ఆర్‌డీఓ సత్యవాణి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌డీఓ, డీఎస్పీ తదితరులు

చీపురుపల్లి: మూగజీవాల సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలని ఆర్‌డీఓ జీవీ.సత్యవాణి అన్నారు. ఈ మేరకు స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డివిజన్ స్థాయి జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతు సంక్షేమ చట్టం ప్రకారం పశువుల అక్రమ రవాణా చేయకూడదని హితవు పలికారు. అక్రమ రవాణా, జంతుబలులు తదితర సంఘటనలు జరగకుండా సంబంధిత శాఖల నేతృత్వంలో పర్యవేక్షణ పెంచాలని స్పష్టం చేశారు. దేవాలయాలకు రెండు వందల మీటర్ల సమీపంలో ఎలాంటి జంతుబలులు జరగకూడదని చెప్పారు. పశువుల అక్రమ రవాణాపై పోలీస్ శాఖ పటిష్ఠ నిఘా అమలు చేయాలని సూచించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య ముద్రించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ జి.శంకరరావు, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు, ఎ.డి ఆర్.శారద, రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రాములప్పనాయుడు, ఆర్‌డీఓ కార్యాలయం ఏఓ ఈశ్వరమ్మ, అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి


మృతిచెందిన రమణమ్మ


వీధుల్లో సోదా చేస్తున్న క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, పోలీసులు


రమణమ్మ(ఫైల్)

సీతానగరం: మండలంలోని బల్లకృష్ణాపురం గ్రామంలో సోమవారం ఉదయం బొత్స రమణమ్మ (75) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. దీనిపై పార్వతీపురం సీఐ గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం రమణమ్మ గ్రామంలోని తన నివాసంలో గెడ్డలుప్పి గ్రామానికి చెందిన తన కుమార్తె సొంగల లక్ష్మితో కలిసి ఉంటోంది. ఆదివారం రాత్రి ఎలుకలు, చిన్న ఇల్లు అని వేరొకరి ఇంట్లో నిద్రించడానికి మృతురాలి కుమార్తె వెళ్లింది. ఆ రాత్రి ఇంట్లో ఒంటరిగా రమణమ్మ నిద్రించింది. సోమవారం తెల్లవారుజామున లక్ష్మి ఇంటికి వచ్చి తల్లి రమణమ్మను లేపేందుకు చూడగా విగతజీవిగా పడి ఉండడం గమనించి భోరున కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి గ్రహించారు. రమణమ్మకు మెడనొప్పి నివారణ కోసం మెడకు బెల్టు కట్టుకుని నిద్రించే అలవాటు ఉంది. తన తల్లిది సాధారణ మరణం అని కుమార్తె లక్ష్మి తొలుత భావించింది. అయితే మృతురాలిపై చీర వేయడం నిమిత్తం ఇంట్లో ఉన్న బీరువా దగ్గరికి వెళ్లి తెరవగానే అందులో ఉండాల్సిన బంగారు ఆభరణాలు, డబ్బులు కనిపించక పోవడంతో ఆందోళన చెందింది. తమ ఇంట్లో దొంగలు పడి బంగారం ఆభరణాలు డబ్బులు చోరీ చేసి తల్లిని హత్య చేసి ఉంటారనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సంఘటనాస్థలానికి సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎస్సై నీలకంఠం, సిబ్బంది చేరుకుని క్లూస్‌టీమ్, గాగ్‌స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించి కేసునమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. రమణమ్మ మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి ఇద్దరు కుమారులు విశాఖపట్నం, హైదరాబాద్‌లో ఉంటారు.